సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 23 । మే । 2025



విత్తన ఎంపికే కీలకం

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 25నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు సాగు పనులకు సన్నద్ధమవుతున్నారు. 8లో▸



సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచుకునేందుకు సేంద్రియ ఎరువుల వినియోగమే మేలు. ఈ దిశగా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'పిల్లల్ని పనిలో పెట్టుకోవద్దు'

ఆదిలాబాద్‌టౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణాధికారి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని జిన్నింగ్ ఫ్యాక్టరీలు, స్టోన్ క్రషర్లు, దాబాల్లో గురువారం సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వలస కార్మికుల సంఖ్య, వారి పిల్లల వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ చోట్ల పనుల్లో ఉన్న పిల్లల కోసం వర్క్‌సైడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎల్‌సీపీవో రమేశ్, వినోద్, పద్మ, ప్రేమేందర్, సుదీప్ ఉన్నారు.

సింగిల్‌విండో వ్యవస్థకు శ్రీకారం

ఆదిలాబాద్‌టౌన్: హెచ్‌టీ సర్వీసుల మంజూరు కోసం సింగిల్‌విండో వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 11కేవీ, 33కేవీ, ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరును వేగవంతం చేయడానికి ఈ విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 11కేవీ వోల్టేజీ దరఖాస్తులను ఏడీ కార్యాలయంలో మానిటరింగ్ చేస్తారని, 33కేవీ వోల్టేజీ దరఖాస్తులను ఏడీ కమర్షియల్ కార్పొరేట్ కార్యాలయంలో పరిశీలిస్తారని పేర్కొన్నారు. కొత్తవి డ్యాష్‌బోర్డులో కనిపిస్తాయని తెలిపారు. 11కేవీ దరఖాస్తులను పరిశీలించి రెండ్రోజుల్లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్‌కు నివాళి



మేఘనాథ్‌కు నివాళులర్పిస్తున్న నగేశ్

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ అర్క మేఘనాథ్ ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలో అనారోగ్యంతో మృతి చెందగా ఎంపీ గోడం నగేశ్ గురువారం అతడి కుటుంబాన్ని పరామర్శించారు. అతడి చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, నాయకులు గణేశ్, రమణ, రాజేశ్వర్, నందినర్సయ్య, వినాయక్, భోజారెడ్డి ఉన్నారు.

'సమస్యలపై పోరాడుదాం'

ఆదిలాబాద్‌అర్బన్: కార్మిక సమస్యలపై పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఐటీయూ కార్యాలయంలో కార్మిక ఉద్యమ నేత సత్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణ స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి నవీన్ కుమార్, నాయకులు మెరుగు జనార్దన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నేళ్ల స్వామి, నాయకులు మంజుల, గంగారాం, గంగన్న తదితరులున్నారు.

నైపుణ్యాభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న ఓంప్రకాశ్

ఆదిలాబాద్‌టౌన్: నైపుణ్యాభివృద్ధికి దోహదపడాలని ఉపాధ్యాయ శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు బోచ్కర్ ఓంప్రకాశ్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆర్పీఎల్ పాఠశాలలో నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బోధన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని, నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని సూచించారు. కోఆర్డినేటర్ నీలాదేవి, రిసోర్స్ పర్సన్లు చిల్క పోచ్చన్న, చరణ్‌దాస్, భూమేశ్, కలీమొద్దీన్ పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కైలాస్‌నగర్: సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ జయంతిని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా హాజరై అధికారులు, దళితసంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. డీఎస్సీడీవో సునీతాకుమారి, డీబీసీడబ్ల్యూవో రాజలింగు, ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, దళిత సంఘాల ప్రతినిధులు, పలువురు వార్డెన్లు పాల్గొన్నారు.



పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు (ఫైల్)

రాజీ కుదిరేనా?

- త్వరలో కాంగ్రెస్ కమిటీల ఎంపిక
- ఆధిపత్యం కోసం నేతల పాకులాట
- తమవారికే ఇవ్వాలంటూ పైరవీలు
- ఎంపిక ప్రక్రియ అబ్జర్వర్లకు సవాలే
- అధిష్టానం చెంతకు ఆశావహుల పేర్లు!

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ బూత్, గ్రామ, మండల, బ్లాక్ కమిటీల ఎంపికలో ముఖ్య నేతల మధ్య సమన్వయం కుదురుతుందా?.. సామాజిక న్యాయానికే ప్రాధాన్యత ఉంటుందా?.. లేదా కమిటీల కూర్పులో ముఖ్య నేతలు తమవారికే పదవులు దక్కేలా చక్రం తిప్పుతారా?.. అనే ప్రశ్నలు ప్రస్తుతం జిల్లా పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు ఈనెల 7న జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించారు. టీపీసీసీ నుంచి పరిశీలకులుగా వచ్చిన ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్, టీపీసీసీ కార్యదర్శి చిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు. ఆ తర్వాత మండలాలవారీగా సమావేశాలు నిర్వహించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణ సమావేశాన్ని కూడా పూర్తి చేశారు. ఈ సమావేశాల్లో మండలాలవారీగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఒక్కో కమిటీకి మూడు నుంచి నాలుగు పేర్లు తీసుకున్నారు. వారి పేర్లను అధిష్టానానికి పంపనున్నారు. ఈనెల 28వ తేదీ లోపు ఈ కమిటీలను పూర్తి చేయాలని భావిస్తున్నారు.



పరిశీలకులకు సవాలే..

కమిటీల ఏర్పాటుకు సమావేశాలు పూర్తి చేసిన పరిశీలకులకు ఇప్పుడు అసలు సవాల్ మొదలైంది. ప్రధానంగా నియోజకవర్గాల్లో ముఖ్య నాయకుల మధ్య సమన్వయం సాధించడం ఒక ఎత్తైతే.. సామాజిక న్యాయం పాటించడం మరొక ఎత్తు. ఈ రెండింటిలో ఏ లోపం చోటుచేసుకున్నా పార్టీలో వివాదాలు, నాయకుల మధ్య విభేదాలు తప్పవు. ప్రధానంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా పరిధిలో రెండేసి మండలాల చొప్పున ఉన్న ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, సీనియర్ నాయకుడు నరేశ్ జాదవ్, ఆసిఫాబాద్‌లో ముఖ్య నాయకుల మధ్య ఈ కమిటీల ఏర్పాటు విషయంలో విభేదాలున్నాయి.

పరిశీలకుల ఎత్తుగడ ఎలా ఉంటుందో..

ఈ నేపథ్యంలో పరి శీలకుల ఎత్తుగడ ఎలా ఉంటుంది?.. నాయకుల మధ్య సమన్వయం సాధిస్తారా?.. సామాజిక న్యాయానికే పెద్దపీట వేస్తారా?.. సమతూకాన్ని ఎలా సాధిస్తారనే చర్చ పార్టీలో జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది.

పట్టు నిలుపుకోవాలని..

జిల్లా అధ్యక్ష స్థానాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు ముఖ్య నాయకులు ఈ కమిటీల ఏర్పాటులో ఎవరి వర్గానికి వారు పెద్దపీట వేసి పార్టీలో పట్టు నిలుపుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని మండలాల్లో ముఖ్య నాయకుల నుంచి వారి అనుచరులకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది. ప్రధానంగా బోథ్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మల్లెపూల నర్సయ్య, గోక గణేశ్‌రెడ్డి తమ అనుచరులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో అందరి మధ్య సమన్వయం సాధించేందుకు పరిశీలకులు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు లేక నియోజకవర్గ ఇన్‌చార్జీలకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో వారు సూచించిన పేర్లకే మొదటి ప్రాధాన్యం ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో చివరికి మిగతా వారి నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురవుతుందో.. అనేది వేచి చూడాల్సిందే.

సామాజిక న్యాయానికే పెద్దపీట



ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్ర కమిటీ ఏర్పాటు కానుండగా జిల్లా నాయకులకూ చోటు దక్కనుంది. సామాజిక న్యాయానికి పెద్దపీట ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు, జిల్లా ముఖ్య నాయకుల సూచనలు పరిగణనలోకి తీసుకుని కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. బూత్, గ్రామ, మండల, నియోజకవర్గానికి రెండు బ్లాక్ కాంగ్రెస్ కమిటీల చొప్పున ఎంపిక చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తి చేసి పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టపరుస్తాం.

– తాహెర్‌బిన్ హందన్, పార్టీ పరిశీలకుడు

'కేంద్ర ప్రభుత్వ విధానం సరికాదు'



కళ్లకు నల్లగుడ్డలతో నిరసన తెలుపుతున్న నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలు, మావోయిస్టులను హత్య చేసినట్లు గర్వంగా ప్రకటించుకున్న కేంద్ర ప్రభుత్వ విధానం సరికాదని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురిని ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేశారని ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవుల్ని కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతోనే మోదీ సర్కార్ ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వివిధ ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు గోడం గణేశ్, వెట్టి మనోజ్, సిర్ర దేవేందర్, వెంకటనారాయణ, జగన్‌సింగ్, గద్దల శంకర్, మడావి గణేశ్, గేడం కేశవ్, మెస్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి'



ఆదిలాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందన్

ఆదిలాబాద్ రూరల్: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పార్టీ జిల్లా పరిశీలకుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు దక్కుతాయని తెలిపారు. గురువారం మండలంలోని యాపల్‌గూడలో కాంగ్రెస్ ఆదిలాబాద్ రూరల్, సాత్నాల, మావల మండలాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా హాజరై మాట్లాడారు. పార్టీ ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని పటిష్టం చేసేందుకే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గ్రామంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, గిమ్మ సంతోష్, భూపెల్లి శ్రీధర్, సాంటెన్న, ఎల్టి భోజారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి

కైలాస్‌నగర్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని, ఇందుకు పార్టీ కార్యకర్తలంతా సమష్టి కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ సూచించారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ ఆదిలాబాద్ పట్టణ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎవరికి పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చినా అంతా కలిసి పార్టీ కోసం పనిచేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దాదాపు రూ.388 కోట్ల విలువైన భూకబ్జాలకు పాల్పడినట్లు ఆరోపించారు. అవినీతికి పాల్పడేవారిని తాను ప్రశ్నిస్తానని చెప్పారు. పార్టీ పరిశీలకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, దిగంబర్‌రావు పాటిల్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, మునిగెల నర్సింగ్, ముజాహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద శాలువాతో సత్కరించారు. జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమేశ్, ప్రజ్ఞాకుమార్, మల్లన్న, బాలశంకర్ కృష్ణ, శశికాంత్, రాఘవేంద్ర, లలిత, కానిందేబాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, 2.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించారు. నిమిషం నిబంధన ఉండగా విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందే కేంద్రాలకు చేరుకున్నారు. ఫస్టియర్‌లో 1,823మందికి 1,716 మంది హాజరు కాగా 107 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో 588 మందికి 531మంది హాజరుకాగా, 57మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో జాదవ్ గణేశ్ తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్?

ఉట్నూర్‌రూరల్: ప్రస్తుతం కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉట్నూర్ పట్టణంలోని హోటళ్లు, మూత్రశాలలు, బస్టాండ్ ప్రాంతం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద మైక్రో జిరాక్స్ చిట్టీలు విచ్చలవిడిగా కనిపించడమే దీనికి నిదర్శనం. ఇన్విజిలేటర్లు, నిర్వాహకులు కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు పరీక్షలకు అనుగుణంగా మైక్రోజిరాక్స్ చీటీలు తయారు చేసి అందుబాటులో ఉంచినట్లు తెలిసింది. వీటిని విద్యార్థులకు విక్రయించినట్లు సమాచారం.

వర్షం.. అతలాకుతలం



ఉట్నూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం సంచులు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

కైలాస్‌నగర్: జిల్లాలో గురువారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం 3గంటలకు వాన పడింది. చిరుజల్లులతో మొదలై సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు నార్నూర్, తలమడుగు, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో భారీ వర్షం పడింది. మరో ఎనిమిది మండలాల్లో చిరుజల్లులతో సాధారణ వాన కురిసింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, రోడ్లపై వర్షపునీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జొన్నల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. నార్నూర్‌లో అత్యధికంగా 123.5 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, తలమడుగులో 82.3, ఆదిలాబాద్ రూరల్‌లో 78.0, తాంసిలో 51.8, ఆదిలాబాద్ అర్బన్‌లో 41.0, గుడిహత్నూర్‌లో 28, ఇంద్రవెల్లి లో 24.3, జైనథ్‌లో 20.5, మావలలో 18 మిల్లీ మీటర్ల చొప్పున మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇచ్చోడలో 9, తలమడుగులో 8.8, బేల, జైనథ్‌లో 7, బజార్‌హత్నూర్‌లో 6.8, ఉట్నూర్‌లో 3, బోథ్‌లో 2.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మూడురోజులు భారీ వర్షాలు

కైలాస్‌నగర్: అల్పపీడన ప్రభావంతో రానున్న మూడురోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా గురువారం ఓ ప్రకటనలో సూచించారు. రైతుల రక్షణ, ట్రాఫిక్, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు పేర్కొన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశమున్నట్లు వారు తెలిపినట్లు వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సాగుపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్: రైతులు పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం నాబార్డ్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఎస్‌ఆర్ భూ సంపదపై మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. నాబార్డ్, దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎస్‌ఆర్‌ఎస్‌ఆర్ భూసంపద కేంద్రం పనితీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాబార్డు, దాన్ ఫౌండేషన్ పనితీరు బాగుందని తెలిపారు. రైతు సభ్యుల సంఖ్య పెంచి మరింత మందికి న్యాయం చేయాలని సూచించారు. ఈ నెల 31 వరకు జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కాగా, రైతుల కోరిక మేరకు మరో 10రోజులు పొడిగించేందుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఏవో శ్రీధర్ స్వామి, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రవూఫ్, దాన్ ఫౌండేషన్ ప్రతినిధి నీలేశ్ రాథోడ్, మండల విద్యాధికారి పవార్ అనిత తదితరులున్నారు.

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో మూడు పట్టణ పోలీస్‌స్టేషన్లు, మూడు సర్కిల్ కార్యాలయాలు, మొత్తం 12 పోలీస్‌స్టేషన్లలో దాదాపు 300 కేసులు త్వరగా పూర్తి చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎంసీ రిపోర్టులను పీఎంఈ, ఎంవీఐ, ఫైర్ అధికారి కార్యాలయంలో పెండింగ్ రిపోర్టులు, అగ్రికల్చర్ కార్యాలయంలోని రిపోర్టులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కోర్టు డ్యూటీ అధికారులు జవాబుదారీతనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్, ఫణీందర్, వెంకటేశ్వర్‌రావు, స్వామి, ఎస్సైలు పాల్గొన్నారు.

'ముందస్తు చర్యలు చేపట్టాం'



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

కైలాస్‌నగర్: జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్లు, భారీ వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు సమకూర్చామని తెలిపారు. ఖరీఫ్‌నకు అవసరమైన విత్తనాలు, యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి నకిలీ, నిషేధిత విత్తనాలు విక్రయించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఏవో శ్రీధర్‌స్వామి, సివిల్ సప్లయ్ డీఎం సుధారాణి, డీఎస్వో వాజీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్‌షాప్‌లో చోరీ

నస్పూర్: పట్టణ పరిధిలోని తెలంగాణ చౌరస్తా వద్ద గల ఓ వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లామని, బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. షాపులోని సుమారు రూ.12వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు.

అటవీశాఖ అదుపులో అనుమానితులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్దపులిని హతమార్చిన ఘటనలో పలువురిని అటవీశాఖ అధికారులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అగర్‌గూడ గ్రామానికి చెందిన ఒకరిని, కోయచిచ్చాలకు చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకుని విచారణ జరుపుతున్న అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అటవీశాఖ కస్టడీలో ఉన్న నిందితులు ఇస్తున్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన సుమారు 13 మందిని విచారిస్తున్నారు.

రహదారిపై నిలిపిన భారీ వాహనాలకు జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఎలాంటి కారణం లేకుండా నిలిపి ఉంచిన భారీ వాహనాలకు గురువారం ఎస్సై స్వరూప్‌రాజ్ జరిమానా విధించి డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రహదారులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వాహనాలు నిలిపి ఉంచడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం సంభవిస్తున్నాయన్నారు. ఇకపై రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఆపాల్సి వస్తే పార్కింగ్ లైట్లు వేసి రెడ్ ట్రయాంగిల్ స్టాండ్ ఏర్పాటు చేస్తూ రహదారిపై ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు, క్లీనర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

కిరాణా దుకాణం సీజ్

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమ్మ గార్డెన్ సమీపంలో గల ఓ కిరాణ దుకాణంలో కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సంతోష్ గురువారం తనిఖీలు నిర్వహించి షాప్‌ను సీజ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు బానేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కనకదుర్గ కిరాణ షాపులో బుధవారం గడికొప్పుల లక్ష్మి అనే మహిళ బ్రెడ్ కొనుగోలు చేసింది. దానిని తెరిచి చూడగా బూజుపట్టి ఉంది. అనుమానం వచ్చి కవర్‌పైన ఎక్స్‌పైరీ డేట్ చూడగా ఈ నెల 18 వ తేదీ వరకు గడువు ఉంది. దుకాణం నిర్వాహకుడినిగా అడిగితే దురుసుగా ప్రవర్తించడంతో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు ఫిర్యాదు చేయగా తనిఖీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. గురువారం షాపులోకి వెళ్లి చూడగా కొన్ని తినుబండారాలు కాలం చెల్లినవి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని షాపు సీజ్ చేశారు.

విత్తన ఎంపికే కీలకం

- రైతులు సరైన వరి వంగడాలు ఎంచుకోవాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ



సాగు చేసిన కూనారం సన్నాల వరి పంట (ఫైల్)

శివకృష్ణ, శాస్త్రవేత్త

బెల్లంపల్లి: వానాకాలం సమీపిస్తోంది. మరో పక్షం రోజుల్లోగా ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. ఇప్పటికే అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలు కానుంది. ఈ మేరకు రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు అనువైన వరి వంగడాలను సాగు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ సూచిస్తున్నారు. పంట దిగుబడి, చీడపీడలు తట్టుకునే గుణం కలిగిన వరి వంగడాల గురించి వివరించారు.

వరి రకాలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి అనువైన వరి వంగడాలు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక రకాలు ఉన్నాయి. దీర్ఘకాలిక రకం (150 రోజులు). ఈ రకం వంగడాలను జూన్ నెలాఖరు వరకు నాటుకోవాలి. మధ్యకాలిక రకాలు (135–140 రోజులు). జులై 15 వరకు నాటుకోవాలి. స్వల్పకాలిక రకాలు (120–125రోజులు) జులై చివరి వరకు నార్లు పోసుకుని 25 రోజుల్లోపు నాట్లు వేయాలి.

స్వల్పకాలిక రకాలు

తెలంగాణ వరి–4 (జేజీఎల్–25958): ఈ రకం వంగడం స్వల్పకాలిక దొడ్డు గింజ రకం. 115 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 65 క్వింటాళ్ల నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది.

కూనారం వరి–2 (కేఎన్ఎం–1638): 120 నుంచి 125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 76 నుంచి 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, బయోటైప్–3, అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది.

బతుకమ్మ: హెక్టారుకు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల పంట దిగుబడిని ఇస్తుంది. 115 నుంచి 120 రోజుల్లో పంటచేతికి వస్తుంది. ఎండాకు తెగులు, సుడిదోమ, పచ్చదోమ తట్టుకుంటుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది. గింజ రాలేగుణం తక్కువ.

జగిత్యాల రైస్(జేజీఎల్–24423): 120 నుంచి 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, సుడిదోమ, గో ధుమ రంగు, ఆకుపచ్చ తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. గింజ రాలేగుణం తక్కువ. చేను నే లపై పడిపోదు. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

మధ్యకాలిక రకాలు

వరంగల్ రైస్–1 (డబ్ల్యూజీఎల్–915): ఈ రకం వంగడం పొడవు, దొడ్డు, గింజనాణ్యత కలిగి ఉంటుంది. అటుకులు, మరమరాల (పేలాలు) తయారీకి అనువైనరకం. 135 రోజులకు కోతకు వస్తుంది. వానాకాలం సాగుకు ఈరకం ఎంతో ఉత్తమమైంది. అగ్గి తెగులు, సుడిదోమ, ఎండాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

కూనారం సన్నాలు(కేఎన్ఎం–118): ఈ రకం వంగడం 118 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్లను తట్టుకుంటుంది. సుడిదోమను కొంతవరకు నివారిస్తుంది.

తెలంగాణ వరి–2 (డబ్ల్యూజీఎల్–697): ఈరకం వంగడం పంటకాలం 135 రోజులు. సన్నగింజ, నాణ్యతతో ఉంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సుడిదోమ, అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగులును తట్టుకుంటుంది.

సోమనాథ్: ఈ రకం వంగడం 130 నుంచి 135 రోజులకు పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. సన్న గింజరకం. ఉల్లికోడును తట్టుకుంటుంది. అగ్గితెగులును కొంతవరకు తట్టుకునే శక్తి ఉంటుంది. నారుమడి దశలో కొంతవరకు చలిని సైతం తట్టుకుంటుంది.

కంపాసాగర్ వరి (కేపీఎస్ 2874): ఈరకం వంగడం 140 రోజుల్లో పంట చేతికి అందివస్తుంది. అధిక దిగుబడిని ఇస్తుంది. గింజలు సన్నగా ఉంటాయి. సాంబమసూరితో పోలిస్తే పైరు ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక రకాలు

ఇంద్ర (ఎంటీయూ–1061): ఈ రకం వంగడం 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. దోమను తట్టుకుంటుంది. నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేయడానికి అనువైనది.

తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్–15048): ఈ రకం వంగడం పంట కాలం 125 రోజులు. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. అతి సన్నబియ్యం. తక్కువ నూక శాతంతో అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. గ్లైమిక్ ఇండెక్స్ తక్కువ.

జగిత్యాల సన్నాలు (జేజీఎల్–1798): ఈరకం వంగడం పంటకాలం 120 రోజులు. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడును తట్టుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. సాగుకు అనువైన రక.

సాంబ మసూరి (బీపీటీ–5204): ఈ రకం వంగడం 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. బియ్యం సన్నగా ఉంటాయి. అన్నం ఎంతో నాణ్యతగా ఉంటుంది. ఏ రకమైన చీడపీడలను తట్టుకోలేదు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లక్సెట్టిపేట: ఈ నెల 19న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామానికి చెందిన ఎలగతి శ్రీలత (29)కు అదే గ్రామానికి చెందిన సురేష్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కొద్దిరోజులుగా కూతురు ఆద్యశ్రీ అనారోగ్యానికి గురైంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈనెల 19న గడ్డిమందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- చెట్టు విరిగిపడి మహిళ మృతి



సునీత (ఫైల్)

జన్నారం: బంధువుల ఇంట్లో పెండ్లికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఈదురు గాలులకు చెట్టు విరిగి మీదపడడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన శనిగారపు జగన్, అతని భార్య సునీత (37)తో కలిసి బుధవారం కడెం మండలంలోని లింగాపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 9 గంటల ప్రాంతంలో జన్నారం మండలం మహ్మదబాద్ గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి బలమైన గాలులు వీయడంతో చెట్టు విరిగి సునీతపై పడడంతో బైక్‌పై నుంచి ఇద్దరు కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సునీత అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జగన్‌ను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి చెవుల మద్ది శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



దండేపల్లి: ఆవును చూపిస్తున్న రైతు తిరుపతి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో గోళ్ల తిరుపతికి గల పాడి ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లే సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్తంభానికి తగలడంతో షాక్‌కు గురైన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఇనుప స్తంభానికి షాక్ వస్తోందని రెండు మూడు రోజులుగా విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. గ్రామంలో గల ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంజనీతండాలో..

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాలో రాథోడ్ దుర్గాదాస్ అనే రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందింది. దేవుని చెరువు దారిలో ఆవు మేత వేస్తుండగా మినీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్తింగ్ రాడ్, వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి ముక్తార్ అహ్మద్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఆవు విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కారులో చెలరేగిన మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పార్కింగ్ చేసి ఉన్న కారులో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే కుడి వైపు ఉన్న పాఠశాల గదిలో డీఈవో రామారావుతో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఎడమ వైపున ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో సమీక్షలో పాల్గొన్న అధికారులు, ఇతర కార్యాలయాల అధికారులు ఒక్కసారిగా హైరానా పడ్డారు. కాగా కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న సత్తనపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌కు చెందిన కారుగా గుర్తించారు. కారులోని బ్యాటరీ వైర్లు ఎర్తింగ్ అయి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. వెంటనే కారు అద్దాలు పగుల గొట్టి అందులోని బ్యాగులు, ఇతర సామగ్రి బయటకు తీసి అక్కడే అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ పోసి మంటలు అదుపు చేయడంతో పాటు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను మానసికంగా, శారీరకంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎ.వెంకటమ్మ తెలిపారు. భోరజ్ గ్రామ సమీపంలో జీఎంఆర్ స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్ వద్ద నిందితుడు సిడాం హిమంత్‌రావు అతని భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తుండడంతో 2019 జూన్ 23న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు డ్యూటీ అధికారి జమీర్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ శైని సుల్తాన విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

విద్యార్థినిని వేధించిన ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: దళిత విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని ప్రైవేటు స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఫని మోహన్‌రావు ఓ మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. 2024 జనవరి 3న ప్రిన్సిపాల్ ఆ విద్యార్థిని తన క్యాబిన్‌లోకి పిలిచి దురుసుగా ప్రవర్తించాడు. అప్పటి మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసు అధికారి సీహెచ్.సంతోష్ 17 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. పీపీ ప్రవీణ్ కుమార్ నేరం రుజువు చేయగా జిల్లా అదనపు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

బాసర: బాసర మండలం కౌట గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన గైక్వాడ్ విలాస్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. గైక్వాడ్ విలాస్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతి వెంట పడ్డాడు. దీంతో ఇద్దరూ కొంత కాలం ప్రేమించుకున్నారు. 20 రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన తీసుకురాగా గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం గ్రామానికి వచ్చిన గైక్వాడ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి

- ఎంపీ గోడం నగేష్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించకుండా దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన వర్గాలైన చెంచు, కోయ వర్గాల ప్రగతికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. ఓవైపు రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే ఏమి చేయలేదని విమర్శిస్తూనే, కేంద్రం నుంచి వచ్చిన నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. గతేడాది అక్టోబర్‌లో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి రూ.152 కోట్లు కేంద్రం నుంచి విడుదలైతే ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. అక్టోబర్, మార్చి నెలల్లో సుమారుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.397 కోట్లు రాగా, వాటిని విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని అడ్డుకుంటుందని మండిపడ్డారు. ఈ నెల 25లోగా కేంద్రం విడుదల చేసిన నిధులు అన్నింటినీ రిలీజ్ చేయాలని, లేనిచో గిరిజన సంఘాలతో కలిసి ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు అస్టక్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు 'ఐఎఫ్ఎస్‌సీ' సమస్య

- పలు బ్యాంకులకు మారిన కోడ్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు డబ్బులు జమ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు మారడంతో తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాలు ఉన్న లబ్ధిదారులకు ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు గతంలో ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీహెచ్, తదితర విలీన బ్యాంకులుగా ఉన్న పాత ఖాతాలే ఇచ్చిన చోట్ల సమస్యలు ఉన్నాయి. సర్వే జరిపినప్పుడు పాత కోడ్‌లే ఉండడంతో అవే వివరాలు అందించారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో పలువురు లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ నుంచి డబ్బులు విడుదల చేస్తున్నప్పటికీ ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు జాప్యం జరుగుతోంది. పునాదుల దశలో ఉన్న వారికి రూ.లక్ష జమ చేస్తున్న నేపథ్యంలో ఈ సమస్య తీర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రాష్ట్రంలో ఇదే తీరుగా పలు జిల్లాల్లోనూ ఈ సమస్య ఉత్పన్నమైనప్పటికీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను మార్చేలా అవకాశం లేక ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనిపై మంచిర్యాల హౌసింగ్ కార్పొరేషన్ పీడీ బాస్సీలాల్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీడీవోలకు ఎడిట్ ఆప్షన్ ఇస్తే సమస్య తీరుతుందని తెలిపారు.

మూడు తరాల నుంచి భూదానం

- వారసత్వంగా భూమిని దానం చేస్తున్న కుటుంబం



విరాళం ఇచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి

సాత్నాల: తాత నుంచి మనవళ్ల వరకు భూదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన నాలం కుటుంబం. ఊరి కోసం తమవంతు సాయంగా లక్షల రూపాయల విలువచేసే భూమిని విరాళంగా అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. భోరజ్ మండలంలోని జాతీయ రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో గిమ్మ గ్రామం ఉంది. గ్రామానికి చెందిన నాలం కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో ఆ ఊరి ప్రజల రాకపోక కోసం తారు రోడ్డు నిర్మాణం కోసం భూమిని వదిలిపెట్టారు. గ్రామంలోని పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనం, వసతిగృహం కోసం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రి, పశువుల కోసం వెటర్నరీ ఆస్పత్రి, శ్మశాన వాటిక, రైతువేదిక నిర్మాణానికి ఆరున్నర ఎకరాల భూమిని విరాళంగా అందించారు. తాత నాలం రాములు నుంచి మనవళ్ల నాలం వామన్, నాలం అనిల్ వారసత్వంగా భూదానం చేస్తున్నారు. నాలం రాములు, అతని కుమారుడు వామన్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వామన్ కుమారుడు నాలం అనిల్‌సైతం తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ తాత దారిలోనే పయనిస్తున్నాడు.

తోచిన సాయం చేస్తా



మా తాత రాములు, నాన్న వామన్ మదిలో గ్రామాభివృద్ధికోసం ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. ఊరి కోసం ఆరెకరాల భూమిని అందించారు. నేను కూడా నాకు తోచిన సాయం చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా. ఇటీవల రైతు వేదిక కోసం భూమిని విరాళంగా ఇచ్చాం.

– నాలం అనిల్

పనిచేయని 'ఇరిగేషన్' ఫోన్లు

- తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతున్న వైనం

దండేపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ఇరిగేషన్ అధికారుల 91549 సిరీస్‌గల ఫోన్‌నంబర్లు కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఫోన్‌చేస్తే ఈనంబర్ నందు ఇన్‌కమింగ్ కాల్ సౌకర్యం తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతోంది. ఇరిగేషన్ అధికారుల డిపార్ట్‌మెంట్ నంబర్లకు రీచార్జ్ చేయక పోవడంతో అవి పనిచేయడం లేదని సమాచారం. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, ఉప్పొంగితే ఏదైనా ప్రమాదం జరిగితే ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలంటే వారి ఫోన్‌నంబర్లు పనిచేయక పోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. బడ్జెట్ లేని కారణంగానే డిపార్ట్‌మెంట్ ఫోన్ నంబర్లకు రీచార్జ్ చేయలేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇరిగేషన్ శాఖ డిపార్ట్‌మెంట్ ఫోన్‌నంబర్లకు రీచార్జ్ చేయించి పనిచేసేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

'బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలి'



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

పాతమంచిర్యాల: బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2026 నాటికి మావోయిస్టు పార్టీని లేకుండా చేయాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నరమేధానికి ఒడిగట్టిందన్నారు. ఏడాదికాలంలో 540 మందిని ఎన్‌కౌంటర్ల పేర చంపేశారని, అందులో అమాయకులు, సామాన్య పౌరులు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీంకోర్టుచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి దేవరాజ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట సత్యం పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కాజేద్దామని పన్నాగం పన్నిన ముగ్గురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నారు. గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌రావు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహలక్ష్మివాడలో ఆరె సుదర్శన్‌కు చెందిన ప్లాట్ నకిలీ దస్తావేజులను పవార్ నవనీత్, గంద్రత్ మహేందర్, పడాల చేతన్ కుమార్ సృష్టించారు. కాలనీలోని 122 చదరపు అడుగుల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఏ–1 నవనీత్ కొనుగోలుదారుడిగా, ఏ–3 పడాల చేతన్ అమ్మిన వ్యక్తిగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏ–2 గంద్రత్ మహేందర్ సహాయంతో పత్రాలు సృష్టించారు. మున్సిపాలిటీలో డోర్ నంబర్ తీసుకొని అధికారులను మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పవార్ నవనీత్, గంద్రత్ మహేందర్‌లను అరెస్టు చేయగా పడాల చేతన్ పరారీలో ఉన్నాడు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. డోర్ నంబర్ ఇచ్చే విధంగా, నకిలీ పత్రాలు సృష్టించే విధంగా ప్రభుత్వ అధికారులు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన వ్యక్తిపై ..

నెన్నెల: సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాల్వ సతీశ్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన రైతు సరండ్ల భూమయ్య తన పొలం చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్‌ను బుధవారం రాత్రి సతీష్ అనే వ్యక్తి దొంగలించాడు. తాగిన మైకంలో తానే దొంగలించానని బోయిని రమేశ్ అనే వ్యక్తితో చెప్పడంతో విషయాన్ని బాధిత రైతు భూమయ్యకు సమాచారం చేరవేశాడు. భూమయ్య గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.